ఒక్కటి నెరవేరితే ఒట్టు!

- ఎన్నికల వేళ చిత్తూరుపై వరాల జల్లులు
- జిల్లా కేంద్రంపై చంద్రబాబు, లోకేష్ హామీలు
- ఇవి కాకుండా ఎమ్మెల్యే, ఎంపీ వ్యక్తిగత మేనిఫెస్టో
- కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తి
- చిత్తూరు వాసులకు ఒక్క హామీ నెరవేరని వైనం



చిత్తూరు ఎంపీ ఇచ్చిన వరాల జల్లుల ప్రకటన


చిత్తూరు ఎమ్మెల్యే సొంత మేనిఫెస్టో

చిత్తూరు అర్బన్: మేమే కనుక అధికారంలోకి వస్తే, మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంటూ ఎన్నికలకు ముందు కూటమి పార్టీ నేతలు కుండలకు కుండలు హామీలు కురిపించారు. అమ్మయినా అడగనిదే అన్నం పెట్టదు అంటారు.. కానీ చిత్తూరు వాసులు అడకుండానే కూటమి నాయకులు వరాల జల్లులు కురిపించారు. ఇది కాకుండా ఆర్థికంగా బలమైన వ్యక్తులైన చిత్తూరు ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి గురజాల జగన్ మోహన్ నాయుడు, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు మరో అడుగు ముందుకేసి పార్టీ మేనిఫెస్టో కాకుండా.. సొంతంగా మేనిఫెస్టోను తయారు చేశారు. తమను గెలిపిస్తే చిత్తూరు వాసులకు ఏమేం చేస్తామో అంటూ లక్షల సంఖ్యలో కరపత్రాలు ముద్రించి ఇంటింటికీ పంచిపెట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చిత్తూరులో ఎమ్మెల్యే, ఎంపీగా గురజాల జగన్‌మోహన్ నాయుడు, దగ్గుమళ్ల ప్రసాదరావు గెలిచారు. మరి వీళ్లు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారు? అసలు ఎన్ని హామీలిచ్చారు..? కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో చిత్తూరులో కార్యరూపం దాల్చిన ఎన్నికల హామీ పనులు ఏవైనా ఉన్నాయేమో పరిశీలిద్దాం.

బాబు హామీలు ఇలా..

ఈ ఏడాది మే 11వ తేదీన చిత్తూరు నగరంలోని మురకంబట్టు కూడలిలో నిర్వహించి ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు సైతం చిత్తూరు ప్రజలకు హామీల జల్లు కురిపించారు. తమను అధికారంలోకి తీసుకొస్తే చిత్తూరులో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. చిత్తూరులోనే ఐటీ టవర్ ఏర్పాటు చేస్తామన్నారు. చిత్తూరుకు పరిశ్రమలు తీసుకొస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రతి ఎకరాకు నీళ్లిచ్చి, చిత్తూరు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. కానీ వీటిలో ఏ ఒక్క హామీను కూడా నెరవేర్చడానికి ఇప్పటివరకు బీజం పడలేదు.

లోకేష్ బాబు హామీలు

గతేడాది ఫిబ్రవరి 6, 7 తేదీల్లో చిత్తూరు నియోజకవర్గంలో యువగళం పేరిట పర్యటించిన నారా లోకేష్ ఇక్కడి ప్రజలకు పెద్ద హామీలనే ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీలకు మాదిగ, మాల, రెల్లి కార్పొరేషన్లు పెట్టారు. వాటికి చైర్మన్లను నియమించి ఏం సాధించారని ప్రశ్నించిన లోకేష్, తాము అధికారంలోకి వస్తే ఎస్సీలకు వెన్నెముకవుతామన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఎస్సీ సబ్‌ప్లాన్‌ను కొనసాగిస్తామని, ఎస్సీలకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. ఇక చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు, ఎలక్ట్రానిక్ మానుఫాక్చర్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్నారు. చిత్తూరు ప్రజల దాహార్తిని తీర్చడానికి శాశ్వత తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. సబ్‌ప్లాన్ కాదు కదా, ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు నోటిఫికేషన్ ఇస్తే ఒట్టు. ఇక యూనివర్సిటీ, ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తి పరిశ్రమ స్థాపనకు గజం స్థలం చూస్తే ఒట్టు.

ఎంపీ గారి ఖాతాలోకి..

ఇక చిత్తూరు ఎంపీ తన వంతు వాగ్దానాలుగా భారీ ప్రకటనల రూపంలో పత్రికల్లో ప్రచురించారు. చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు, మామిడికి మద్దతు ధర ఇవ్వడానికి మ్యాంగో బోర్డు, ఏనుగుల దాడుల నివారణకు బంగారుపాళెం నుంచి కుప్పం వరకు సోలార్ ఫెన్సింగ్, అంతర్జాతీయ కంపెనీల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు, అడవిపల్లె రిజర్వాయర్ నుంచి తెలుగు గంగ నీటిని చిత్తూరుకు తీసుకొస్తామని, చిత్తూరులో ఆటోమొబైల్ పార్కు, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు, క్రీడల కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం, కాట్పాడి - తిరుపతి మధ్య డబుల్ లైన్ మంజూరు, నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీ, నిరుద్యోగులకు స్టడీ సర్కిల్ ఏర్పాటు, ప్రతి నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల ఏర్పాటు, సీఎంసీ ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం హెల్ప్‌లైన్, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రామా సెంటర్ ఏర్పాటు,మహిళలకు ఉద్యోగ అవకాశాలు, ప్రతీ నియోజకవర్గంలో వెనుకబడ్డ వర్గాలకు కమ్యూనిటీ హాలు నిర్మించుకోవడానికి సహకారం అందిస్తామని హామీల వర్షం కురిపించారు. వంద రోజులు పూర్తయినా ఇంకా వీటిలో ఏవి ఎప్పటి నుంచి అమలవుతాయని ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

గురజాల మేనిఫెస్టో..

చిత్తూరులో తాను గెలిస్తే ఏం చేస్తానో చెబుతూ జగన్‌మోహన్ నాయుడు సొంత మేనిఫెస్టో రూపొందించారు. దీన్ని చూసిన ప్రజలు కూటమి అభ్యర్థిగా జగన్‌మోహన్ నాయుడును గెలిపించారు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పిన సూపర్ సిక్స్ ఒక్కటీ ఆచరణలోకి రాకపోగా, చిత్తూరు లాంటి జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ, ఐఐఐటీ, నవోదయ కేంద్రీయ విద్యాలయాలు, ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు, నీవానదికి రెండు వైపులా గోడలు నిర్మించి ముంపు రాకుండా చేస్తామని, చిత్తూరు రూరల్, గుడిపాల్లోని పీహెచ్‌సీ ఆస్పత్రులను వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి, అసంపూర్ణంగా ఉన్న అడవిపల్లె రిజర్వాయర్ వేగవంతం చేస్తామని చెప్పిన గురజాల, వీటితో పాటు గుడిపాలలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గార్మెట్, షూ కంపెనీ పెడతామని హామీ ఇచ్చారు. వీటిల్లో నవోదయ పాఠశాల కోసం మాత్రం స్థల పరిశీలనకు అధికారుల బృందం వచ్చి వెళ్లారు. తరువాత ఏం జరిగిందో కూడా తెలియని పరిస్థితి. మిగిలిన హామీల మాట ఎంత వరకు వచ్చిందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక రెడ్డిగుంట, తుమ్మిందపాళెం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఆ రెండు సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

మృతులకు సునీల్‌కుమార్ నివాళి


గుండ్లకట్టమంచిలో మృతులకు నివాళులర్పిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన తాత మనవడికి శుక్రవారం పూతలపట్టు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ నివాళులర్పించారు. గుండ్లకట్టమంచి దళితవాడలో గురువారం రాత్రి విద్యుత్ షాక్‌తో నాగయ్య, అతని మనవడు రాజ్‌కుమార్ మృతిచెందిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న సునీల్‌కుమార్, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, స్థానిక సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, నాయకులు జయదేవ్‌రెడ్డి, మొగిలిరెడ్డి తదితరులు మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నేటి నుంచి ప్రజావేదిక

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు పూర్తిచేసుకున్న నేపథ్యంలో శనివారం నుంచి ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మహ్మద్ రియాజ్ ఉద్దీన్ తెలిపారు. 21న దిగువమాసాపల్లి, ఆనగల్లు, 23న ముత్తుకూరు, బీఎన్ఆర్ పేట, అనంతాపురం, 24న పెరుమాళ్ల కండ్రిగ, గువ్వకల్లు, చింతలగుంట, తాళంబేడు, 25న తొప్పాతిపల్లి, తుమ్మింద, నాయనిచెరువు, పెద్దిశెట్టిపల్లి, 26న చెర్లోపల్లి, పాలూరు, పచ్చనపల్లిలో గ్రామసభలు నిర్వహించి, ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ చాటిన బృందావన్ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: ఇటీవల కాకినాడ జిల్లాలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ అండర్- 14, 17, 19 పోటీల్లో బృందావన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బాలుర విభాగంలో హర్షిత్, విష్ణు, రెడ్డిప్రసాద్, రిషి, బాలికల విభాగంలో నీతుశ్రీ, దేవశ్రీ, బహుమతులు సాధించారు. వారిని బృందావన్ పాఠశాల కరస్పాండెంట్ శైలజ, డైరెక్టర్ ప్రియతేజ శుక్రవారం అభినందించారు.

సందడిగా స్కూల్ గేమ్స్ పోటీలు

నగరి: మండలంలోని క్రీడా మైదానాల్లో 68వ స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడలకు ప్రాచుర్యం కల్పించే ఉద్దేశంతో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. ఇలా పోటీలు నిర్వహిస్తుండడంతో మైదానాల్లో సందడి నెలకొనడమే కాకుండా క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నాగరాజకుప్పం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం అండర్ 14, 17 బాల బాలికలకు మండల స్థాయి చెస్, యోగా, అథ్లెటిక్స్, ఖోఖో టోర్నమెంట్, నియోజకవర్గ స్థాయి సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం హాజరై ప్రారంభించారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఇద్దరి ఎంపిక

పుంగనూరు: అండర్-17 చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు తమ స్కూలు విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని మండలంలోని చంద్రమాకులపల్లె హెచ్ఎం శ్రీదేవి తెలిపారు. అన్నమయ్య జిల్లాలో జరిగిన ఫుట్‌బాల్ జట్టు ఎంపికలో తమ స్కూల్ 8వ తరగతి విద్యార్థి కె.ఆనంద్, విద్యార్థిని జి.రక్షిత జిల్లా జట్టుకు ఎంపికయ్యారని, వీరు ఈనెల 28 నుంచి 30 వరకు పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఫిజికల్ డైరెక్టర్ మురళీధర్, ఉపాధ్యాయులు వెంకట్రమణారెడ్డి, జ్యోతి, శైలజ, మంజునాథ్, శంకర్‌రెడ్డి, రఘు, సుజాత , స్కూల్ కమిటీ చైర్మన్ నారాయణ, రమణ తదితరులు అభినందించారు.


క్రీడలకు ఎంపికైన వారితో హెచ్ఎం శ్రీదేవి

గత ప్రభుత్వంలో నిర్మాణం.. తాజాగా ప్రారంభం


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తయిన ఆస్పత్రి భవనం

బంగారుపాళెం: ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండల కేంద్రంలో నూతన ఆస్పత్రి భవనాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో 30 పడకల కొత్త భవన నిర్మాణ పనులను చేపట్టింది. రూ.5 కోట్లతో అన్ని సదుపాయాలతో భవన నిర్మాణాన్ని పూర్తి చేసింది. ఈ పనులు 2023 నవంబరుకు ముందే పూర్తయ్యాయి. అప్పట్లో ప్రారంభానికి నోచుకోలేకపోయింది. ఈ భవనాన్ని శుక్రవారం ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు.

సింగిల్ విండో మాజీ చైర్మన్ మృతి


జయచంద్రనాయుడు

గుడిపాల: సింగిల్ విండో మాజీ చైర్మన్, మాజీ ఎంపీటీసీ, సర్పంచ్ జయచంద్ర నాయుడు(60) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడిగా పార్టీకి పలు సేవలందించారు. గత కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆయన శుక్రవారం ఆయన కన్నుమూశారు. శనివారం మధ్యాహ్నం బసవాపల్లె పంచాయతీ సీకే పల్లెలో దహనక్రియలు నిర్వహించనున్నట్లు వారి కుటుంబసభ్యులు తెలిపారు.

సాంస్కృతిక నీరాజనం




మాడ వీధుల్లో వరసిద్ధి వినాయకస్వామి విహారం






పుష్ప పల్లకీని సిద్ధం చేస్తున్న సిబ్బంది

ప్రత్యేక ఉత్సవాలను పురస్కరించుకుని కళాకారులు వరసిద్ది వినాయక స్వామికి సాంస్కృతిక నీరాజనం సమర్పించారు. దేవస్థానంలోని సాంస్కృతిక కళా వేదికపై కళాకారులు తమ నాట్యంతో వీక్షకులను కట్టిపడేశారు. తిరుపతికి చెందిన రిటైర్డ్ టీచర్ ధార్మికోపన్యాసం, గుట్టకిందపల్లె రాశేఖర్‌రెడ్డి, షణ్ముఖ శెట్టి హైదరాబాద్‌కు చెందిన అభిరామ్ భక్తిగీతాలాపనతో అలరించారు. తిరుపతికి చెందిన నటరాజ నృత్య కళాక్షేత్ర, ఐశ్వర్య సత్యభామ సహస్ర ఆర్ట్స్ నేషనల్ అకాడమీ, చిత్తూరుకు చెందిన ఉమా బాల కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవాల్లో ప్రత్యేకతను చాటుకున్నాయి.

-కాణిపాకం


సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న కళాకారులు


ధార్మికోపన్యాసం ఇస్తున్న రిటైర్డ్ టీచర్

డయాలసిస్ కేంద్రం ప్రారంభం


డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని మంత్రి నారా లోకేష్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తాను యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను దశల వారీగా అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, పూతలపట్టు, పలమనేరు, చంద్రగిరి, చిత్తూరు ఎమ్మెల్యేలు మురళీమోహన్, అమరనాథరెడ్డి, పులివర్తినాని, గురజాల జగన్‌మోహన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి పాల్గొన్నారు.

మంత్రి ప్రజా వేదికలో వినతుల వెల్లువ

బంగారుపాళెం: మండల కేంద్రంలోని అరగొండ రోడ్డులోని ఎస్ఎల్‌వీ కల్యాణ మండపంలో శుక్రవారం మంత్రి నారా లోకేష్ నిర్వహించిన ప్రజా వేదికలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. అంగన్‌వాడీ వర్కర్స్‌కు వేతనాలు పెంచాలని, సీపీఎస్ రద్దు చేయాలని, విద్యాశాఖలో సీఆర్ఎంటీలను రెగ్యులర్ చేయాలని, తిరుపతిలో అన్యాక్రాంతమైన హథీరాంజీ భూములను కాపాడేందుకు బంజారాల ఆధ్వర్యంలో ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయా సంఘాల ప్రతినిధులు మంత్రికి విన్నవించారు.

బడుల్లో మెరుగైన వసతులు కల్పిస్తాం

పూతలపట్టు: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఆయన శుక్రవారం బంగారుపాళెం నుంచి రేణిగుంటకు వెళ్లే మార్గంలో మండలంలోని ఆకనంబట్టు ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొంత మంది విద్యార్థులు తమకు పాఠ్యపుస్తకాలు అందలేదని, స్కూలులో బెంచీలు లేవని మంత్రికి చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణానికి ఇసుక ఏదీ?


పునాది దశలో ఆగిపోయిన ఇంటి నిర్మాణం

గంగాధర నెల్లూరు: వంద రోజుల కూటమి ప్రభుత్వంలో 100 కష్టాలు పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. దేశ చరిత్రలోనే ఎవ్వరూ ఇవ్వలేనంతగా గత ప్రభుత్వం గృహ నిర్మాణాలకు స్థలాలతోపాటు అవసరమైన నగదు, సామగ్రిని అందజేసింది.

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పనులకు ఇసుక దొరకడం లేదు. అయినా 100 రోజుల్లో పునఃప్రారంభించాలని, పూర్తి చేయాలని లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో గంగాధర నెల్లూరు మండలంలో 3,175 నిర్మాణాలు మంజూరుకాగా గత ప్రభుత్వంలోనే 2,136 ఇళ్లు 100% పూర్తయ్యాయి. ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న 859 నిర్మాణాలు మార్చి 2025వ తేదీలోపు కచ్చితంగా పూర్తి చేయాలని ప్రభుత్వం వంద రోజుల పథకం తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా 210 రూఫ్ లెవెల్, 221 రూఫ్ కాస్ట్ పూర్తయిన ఇళ్లను వంద రోజుల్లోపు నిర్మాణం పూర్తి చేయాలని నోటీసులు అందజేశారు. వంద రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశాలిచ్చిన ఇసుక ఏమాత్రం ఇవ్వడం లేదని ప్రజలు వాపోతున్నారు. మరోవైపు నీవా నది నుంచి ఇసుక తీసుకోవచ్చని పత్రికల్లో ప్రకటనలు వస్తున్నాయి. అయితే ఇసుక తీసుకురావడానికి వెళితే పోలీసులు అక్రమ రవాణా పేరు చెప్పి కేసులు బుక్ చేస్తున్నారు. చిత్తూరు రూరల్ మండలం నుంచి ప్రభుత్వ నిర్దేశిత రీచ్ నుంచి ఇసుక తీసుకురావడానికి ఒక ట్రాక్టర్ వెళితే రోజు ఒక లోడ్ మాత్రమే తీసుకువచ్చే అవకాశం ఉంది. ఒక ట్రాక్టర్ ఇసుక లోడ్ చేసుకోవడానికి రెండు మూడు రోజులు పడుతుంది. అన్ని రోజులకు ట్రాక్టర్‌కు బాడుగ ఇవ్వలేక సమయానికి ఇసుక తీసుకురాలేక, పనులు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉంటే చర్యలు

చిత్తూరు అర్బన్: నగరంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే చర్యలు తప్పవని నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం నగరంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ సంతపేట పీఎన్‌సీ ఉన్నత పాఠశాల మైదానంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణను తనిఖీ చేసి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం వన్నియర్ బ్లాక్, బజారు వీధి, హైరోడ్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యం తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులు సక్రమంగా, సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఉదయం 8 గంటలకల్లా ప్రధాన రహదారులు, వీధులు శుభ్రం చేయాలని, ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ తప్పని సరిగా చేపట్టాలన్నారు. డంపర్ బిన్లలో చెత్త సకాలంలో క్లియర్ చేయాలని, డంపర్ బిన్ల వద్ద అపరిశుభ్రంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్దేశించిన సమయం వరకు పారిశుధ్య కార్మికులు పనులు చేసేలా పర్యవేక్షించాలని వార్డు కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం ఉన్నారు.

స్వచ్ఛతా హీలో భాగస్వామ్యం

స్వచ్ఛతా హీ సేవ -2024 కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. నగరంలోని జైహింద్ పాఠశాలలో విద్యార్థులు, మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించి, స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ, పరిసరాల శుభ్రత కోసం విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భాగస్వాములు కావాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మానవుల ఆరోగ్యం బాగుంటుందని, ఈ విషయంపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. పరిసరాల పరిశుభ్రత అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని నాగాలమ్మ ఆలయం వద్ద నిల్వ నీటిలో దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్ వేశారు. దోమల నియంత్రణకు స్ప్రేయింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకానాథం, నరసింహ, హెచ్ఎంలు బాలసుబ్రహ్మణ్యం, ముక్తార్ అహ్మద్, కల్పన, వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.




పనులు తనిఖీ చేస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేషన్ అధికారులు